# ఆంధ్రప్రభలో శ్రీమతి శోభానాయుడు గారి గురించి వచ్చిన ఆర్టికల్

## నవరస య'శోభా'మిని

శోభ... కూచిపూడి నృత్య కళకే వన్నెతెచ్చిన సురభిళాలు వెదజల్లిన నవ వసంత శోభ. నాట్యమే వేదంగా, నిజజీవన నాదంగా, పండితపామర రసజ్ఞజనామో దంగా, ప్రసన్న సుహృత్ ప్రసూన ప్రమోదంగా, అందగించే ఎలనాగ, పద్మశ్రీ డా॥ శోభానాయుడు.

ఆమె నర్తిస్తే, కలహంసలు సిగ్గిల్లుతాయి. ఆమె రంగస్థలి మీద వర్తిస్తే, కెరలేమయూరాలు సైతం లజ్జానవతలౌ తాయి. ఆమె అభినయిస్తే, ఆమె నయగారాలలో, శంపాలతలు మెరవడానికి సంశయిస్తాయి. ఆమె కనుబొమలు కదలిస్తే పాలపుంతలు మోహరిస్తాయి. ఆమె రసార్ద్ర నయనాంచలలో ఇంద్రధనువులు కాహాళిస్తాయి. ఆమె పాటలధరాల కదలికలో శరదేందు చంద్రికలు తరళిస్తాయి. ఆమెనవరస నటనా విన్యాసాలు నటరాజుకి నవరసామృభిషేకాలు. సత్యభామగా హొయలుపోతే, వంశీమోహనుడి మురళిలా చూపరుల హృదయాలు రవళిస్తాయి. శ్రీనివాసకళ్యాణంలో, శ్రీదేవిగా సాక్షాత్కరిస్తే, అశేష జనాంతరంగాలు నిరుపమ భక్తి భావంతో పరవశిస్తాయి. ఆమె సాయినాథుడిగా దర్శనమిస్తే, ప్రేక్షకుల డెందాలు అమందానందకదళితారవిందాలై విరుస్తాయి. ఆమె గౌతమబుద్ధుడిగా అవతరిస్తే, అంతరాంతరాళాలు ఆధ్యాత్మి కానుభూతిలో తరిస్తాయి. ఆదిశక్తిగా, రౌద్రభద్రకాళిలా విజృంభిస్తే, పరిసరాలు భీతావహంతో బిగిసిపోతాయి. ఆమె బీభత్స రసంప్రసరిస్తే జ్వలిత నేత్రాలలో విస్ఫురత్క ణాలు చెరుగుతున్న భావనకి గురిచేస్తాయి సభాప్రాంగ ణాలు గడగడలాడు తాయి. ఆమె భయానక రూపంగా ఆవహిస్తే, సచరాచరాలూ వులికిపడ తాయి. ఆమె శాంతవ దనంతో సమాదరిస్తే, సౌహృద పద్మాలు వికచి స్తాయి. ఆమె కరుణార్ద్రగా కరిగిపోతే, ఘనీభవించిన కరడుగట్టిన గండ శిలలాంటి హృదయాలు కూడా ద్రవి స్తాయి. ఆమె అద్భుత రసం జాల్వారిస్తే, ఆబాలగోపాలం మైనరచి పోతారు. ఆమె ఆశ్చ ర్యచకితగా నటిస్తే, నిండుపేరోలగం సంభ్రమిస్తుంది. ఆమె హాస్య రసం చిలి కిస్తే, ఎదలు పులకరి స్తాయి. ఆమె శృంగారాలు ఒలికిస్తే, సింగార భావనలు పుల్లమిస్తుంది.. ఇంతటి నటనా పాటవం కలబోసు కుని, శిష్య ప్రశిష్యగ ణాల ప్రతిభా వ్యుత్పత్తులని కలవేసుకుని, నితాం తక్రమశిక్షణతో, నిరంతర శిక్షణలో,

కూచిపూడి నాట్య తపస్సే, తన యశస్సుగా భావిస్తూ, భారతీయ కూచిపూడి నాట్యకళని ఖండఖండాంతరాలకి వ్యాపింపజేస్తున్న, అవిశ్రాంత, నవరస నటయశోభామిని, పద్మశ్రీ డా|| శోభానాయుడు. ఆమె నృత్తగాన మాధురీ పరీవాహ శోభ. నృత్య శబ్ద విలసిత విన్యాస ప్రలోభ. నాట్యకళాప్రపూర్ణేందు షోడశోజ్జ్వలకాంతిచ్ఛటా సంభ్రమప్రభ. సంగీత, సాహిత్య, నాట్య, సురమ్య సంగమ సముచ్చయ యశోః విలాసాభ.

అనర్ఘా కాంగిభినయాలవాల. సమున్నత మూర్ధ్యోరోజ, హస్త, పాదాంచిత నృత్యకళాపరిపాల. నయన, నాసికాధర సురుచిర కపోల, చుబుక సంచలన హేల. దృంగంచలాంకిత విశాలఫాల ప్రఫుల్ల హావభావ పరిపాల.అత్యద్భుత వాచికాభినయరంగత్తరంగడోల. మంద, మంద్ర, వుచ్ఛైస్వర నిస్వనస్వన దశరూపకాభిజాల. భువనమోహన సహజ సౌందర్యాభూషణ మణిప్రవాళ. విస్ఫురద్వస్త్ర పరిధాన ప్రవిమలాలంకార సంచాల. సముజ్జ్వలాహార్య ధారణాధుర్యారాళకుంతలవిశాల. సాత్విక శృంగారాభినయ విలోల. సహస్రానేక విశేషణ నామ తత్తుల్య తరళావిరళ సంశోభ, డా|| శోభానాయుడు

ఆమె నాట్య విన్యాసం అవిరళం, అమేయం, అలౌఖ్యం, మది మదినీదోచే ముగ్ధమోహన విన్యాసం, ఏ పాత్రతోనైనా మెప్పించగల లాలిత్యం, పద విభ్రమణంతో, కైలాస గిరులను సైతం కదిలించగల అపూర్వ నాట్య విన్యాసం, ఆమెకే సొంతం. నిరంతర నృత్య తపోనిష్ఠాగరిష్ఠతతో, నటరాజు పూజకు చివురించిన కుసుమంలా, నాట్య సుగంధ పరిమళాలు నలు సెలవురా వ్యాపింపజేస్తూ, నాట్య కళావనిలో, సంప్రదాయ సురభిళాలు వెదజల్లుతూ, శోభస్కరం చేస్తున్నారు, పద్మశ్రీ డాక్టర్ శోభానాయుడు.

శిష్యప్రశిష్య నాట్యాభిరామగా...

శిష్య ప్రశిష్యరసార్ద్ర జీవన నిష్యందినిగా, అపార శిష్యవాత్సల్య విలక్షణాలతో, తన నాట్య పరంపరను కొనసాగించేందుకు అనేక మంది శిష్యులను తయారు చేశారు, చేస్తున్నారు, డా|| శోభానాయుడు.

సనాతన నృత్య కళాపారంగతగా...

నాట్యకళామతల్లి గర్వించదగ్గ సర్వోత్రృష్ట నాట్య శిఖామణి, నటరాజ పాద పంకజ భ్రమరాయమణి, నృత్యచూడామణి, శోభానాయుడు. సనాతన సంప్రదాయ సాంస్కృతికాసక్తిలో, శాస్త్రీయ నృత్యానురక్తిలో, సురమ్య సృజనాత్మక శక్తిలో ఆమెకి ఆమే సాటి. ఆమె నర్తించే రంగస్థలి, వర్తించే అంతరంగస్థలికూడా, ప్రపూర్ణత్కళానందచంద్రోదయ ప్రాక్శిఖరమే.

నృత్య శిక్షణాదక్షురాలిగా...

కూచిపూడి నాట్య కళకే అంకితమై, 1980 వ సంవత్సరంలో కూచిపూడి డాన్స్ అకాడమి నెలకొల్పి, ఆ సంస్థకు డైరెక్టర్‌గా, ప్రిన్స్‌పాల్‌గా, కూచిపూడి నాట్య భావాలను విస్తరింపజేస్తోన్న, నృత్య సామ్రాజ్ఞి ఆమె. శ్రీనివాస ఆర్ట్ అకాడమి తరఫున, ఘుంఖాను ఘుంఖాలుగా ప్రదర్శనలు ఇవ్వటమే కాక, సమాజ భిన్న పోకడలను నిశితంగా పరిశీలిస్తూ, పురాణ ఇతివృత్తాలను ఆధారంగా చేసుకుని, సమాజంలో చైతన్యం రావాలన్న సత్సంకల్పంతో, అనేక నృత్య రూపకాలకు శ్రీకారం చుట్టారు. 'విజయోస్తుతే నారీ', 'శ్రీకృష్ణ శరణం మమ', 'సర్వం సాయి మయం' వంటివి, ఆమె మస్తిష్కం నుంచి వెలువడిన అపూర్వ నృత్యరూపకాలు. అయితే, వీటిలో ఇటీవలి కాలంలో రూపొందించిన 'నవరసనటభామిని' అనేక కోణాలలో కళాభిమానుల్ని అలరించగలిగింది.

నవరస నృత్యాభినేత్రిగా...

నాట్య అభినేత్రిగా, అనేకానేక పాత్రలలో జీవించిన శోభానాయుడు రూపొందించిన నిరంతర హృదంతర నవరసామృత భరిత నృత్య రూపకం 'నవసరసనటభామిని'. బహిరంతర్ప్రతిభాప్రభాభాసినిగా, హావభావ తుహితుగిరుల వాసినిగా, మందాకినీ యశోవిలలాసినిగా, నవరస నటభామనిగా, ఆమె పార్వతి పాత్రలో ఇమిడిపోయారు. వేదవ్యాసుడి సర్వోత్కృష్టమైన కావ్యాలలోని పార్వతి చరిను ఆధారంగా చేసుకొని, నవరసాల సమాహారంగా ఈ రూపకాన్ని తీర్చిదిద్దారు. శ్రీదేవీ భాగవతంలోని అనేక 'ఘట్టాలను నవరసాలతో మేళవించి ఓ, అద్భుత నాట్య కళాఖండానికే రూపమిచ్చారని చెప్పొచ్చు. లోకమాత అయిన ఆజగదంబ లంబోదరుడికి ప్రాణం పోసినట్లు, సురమ్య సృజనాత్మక శక్తితో, 'నవరసనటభామిని'కి ప్రాణం పోశారు డా|| శోభానాయుడు.

చతుష్కళా సంశోభితగా...

ఈ నృత్యరూపకానికి కొన్ని చోట్ల ఆమె స్వయంగా సాహిత్యాన్ని కూడా సమకూర్చినట్లుగా చెప్పారు. అయితే నర్తకిగా, నాట్యాచారిణిగా సుపరిచితురాలైన శోభానాయుడుకి, సంగీతంలో, సాహిత్యంలో, చిత్రకళలో సైతం ప్రవేశం ఉంది. నృత్య రూపకాల్ని తీర్చిదిద్దేటప్పుడు సాహిత్యాన్ని, సంగీతాన్ని తనకు కావల్సిన విధంగా కూ(మా)ర్చుకోవటం ఆమెకే చెల్లింది.

నిరంతరాధ్యయన జిజ్ఞాసిగా...

జీవితంలో శిఖరాగ్రస్థానాన్ని చేరుకున్నా, ఇంకా ఏదో నేర్చుకోవాలన్న జిజ్ఞాస, సంకల్ప సాధన, ఆమెకి మాత్రం తరగలేదు. నిరంతరాయంగా పుస్తక పఠనం చేయటం, అలా సముపార్జించిన జ్ఞానాన్ని వృథాకానివ్వకుండా, తనదైన శైలిలో మలచి నృత్య రూపకాల ద్వారా సమాజానికి అందజేశారామె.

బహుభాషా శేముషీ ధురంధరగా....

ఆంగ్ల సాహిత్యమంటే ఇష్టపడే శోభానాయుడు, భారతీయ దక్షిణాది భాషల్లో అనర్గళంగా మాట్లాడగలరు. అలా, భాషావాఙ్మయ, సాహిత్యపరంగా, బహుభాషా కోవిదురాలు, డా॥శోభానాయుడు.

భవ్యనృత్యవారాసిగా...

నిన్నటి తరం నుంచి ఈ తరానికీ, ఈ తరం నుంచి రేపటి తరానికీ సమున్నత కళావారసత్వం అందించాలనే శోభ ఆశయాలను సాదృశ్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు వారి శిష్యగణం.

సద్యఃచైతన్య స్ఫూర్తితో...

ఆమె విస్ఫురత్ స్ఫూర్తితో, ఆమె ఆశీఃపరంపరలో, అఘమర్షణ స్నానంచేసి, ఆమె అడుగు జాడల్లో నడవటం ఆమె శిష్యబృంద జన్మ జన్మాంతరపుణ్య ఫలమే. తన శిష్యుల చేత వినూత్న ప్రయోగాన్ని త్వరలోనే ఆవిష్కరించనున్నారు, మనోహర దరహాస వికాసాధర, పద్మశ్రీ డాక్టర్ శోభానాయుడు. తప్పటడుగులే వేయడంరాని, నాలుగేళ్ల బాలికల నుంచి, నడక, నడత నేర్చుకుంటున్న కన్నెలదాకా అందరికీ, 'శ్రీనివాస కళ్యాణ' ప్రాశస్త్యం ఆకళింపజేసి, భాగ్యనగరిలో, విశాఖలో, కోణార్క్‌లో... అలా నేల నాలుగు చెరగులా, సముత్తుంగరంగస్థలులమీద అభినయింపజేయాలని సంకల్పించిన సముదాత్త సుగ్గురువరేణ్య డా॥ శోభానాయుడు.

http://www.andhraprabhaonline.com/specialstoryies/article-54857 -
శ్రుతి కీర్తి -   Sun, 6 Dec 2009